


- యువతకు బతుకు తెరువు చూపుతున్న ట్రాక్టర్ నగర్
- ఏడు రాష్ట్రాలకు ఏకైక సంస్థ

# విజ్ఞానం.. ఉపాధి

**వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్‌కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. పొలం పనులు మొదలైనప్పటి నుంచి పంట ఇంటికొచ్చే వరకు ట్రాక్టర్‌నే ఉపయోగిస్తున్నారు. రైతు జీవితంలో ముఖ్య పాత్ర పోషించే ఈ ట్రాక్టర్‌ల నిర్వహణకు సంబంధించిన శిక్షణ కేంద్రాలు దేశవ్యాప్తంగా నాలుగే ఉన్నాయి. వ్యవసాయ పెట్టుబడుల్లో పొదుపు, ఉత్పాదనలో పెరుగుదల సాధించడానికి దేశంలోని బుదిని (మధ్యప్రదేశ్), హిస్సార్ (హర్యానా), విశ్వనాథ చారియాలి(అసోం), ట్రాక్టర్‌నగర్ - గార్లదిన్నె (ఆంధ్రప్రదేశ్)ల్లో వ్యవసాయ యంత్రాల పరీక్ష, శిక్షణ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం స్థాపించింది.**

**- గార్లదిన్నె**

దక్షిణ భారత దేశంలోని ఏడు రాష్ట్రాలకు కలిపి గార్లదిన్నె వద్ద 1983లో 500 ఎకరాల విస్తీర్ణంలో ట్రాక్టర్ నగర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలు లబ్ధి పొందుతున్నాయి. మన రాష్ట్రం మినహా మిగిలిన ప్రాంతాల నుంచి నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఇక్కడకు వచ్చి శిక్షణ పొందుతుంటారు. సరైన ప్రచారం కల్పించకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా మినహా మిగిలిన జిల్లాల యువత తీవ్రంగా నష్టపోతోంది.

## సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కోర్సులు

సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చే యూజర్ లెవెల్ కోర్సులు ఒక వారం నుంచి ఆరువారాల వరకూ వివిధ రకాలుగా ఉన్నాయి. టెక్నీషియన్ కోర్సుల్లో కూడా రెండు వారాల నుంచి ఆరువారాల వరకు శిక్షణ ఇస్తారు. అదేవిధంగా యూజర్ లెవెల్ కోర్సులకు కనీస విద్యార్హత 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి. వయసు 18 ఏళ్లు పూర్తి అయిన వారు అర్హులు. పొలం, వ్యవసాయ యంత్రాలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఈ కోర్సులన్నీ ఉచితంగా నేర్పుతారు. అంతేకాక శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ. 2 వేలు చొప్పున ఉపకార వేతనాన్ని కూడా అందిస్తారు. శిక్షణలో చేరటానికి, శిక్షణ తర్వాత వారి స్వగ్రామం వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులు కూడా భరిస్తారు. టెక్నీషియన్ లెవెల్ కోర్సులకు ఐటీఐ (డీజల్, మోటర్ మెకానిక్) కోర్సు పూర్తి చేసి ఉండాలి. వయసు 18 ఏళ్లు పూర్తి అయి ఉండాలి. ఈ కోర్సులకు మాత్రం వారానికి రూ.50 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## అభ్యర్థులకు వసతి సదుపాయాలు

ఇక్కడ శిక్షణ పొందేందుకు వచ్చిన వారికి అన్ని రకాల సౌకర్యాలు ఉన్న అధునాతన వసతి గృహం ఉంది. ఇందులో సుమారు వంద మంది విద్యార్థులకు ఉచితంగా వసతి కల్పిస్తారు. అలాగే భోజన సౌకర్యం కూడా ఉంటుంది. అయితే దీనికి విద్యార్థులే రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల వినోదం కోసం అన్ని సౌకార్యాలు కల్పించారు. విద్యార్థులు, ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం నిమిత్తం ఉచిత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. శిక్షణ పొందే విద్యార్థులకు, సంస్థ ఉద్యోగుల కోసం ఒక విజ్ఞాన సమాచార కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ భాషల్లో, వ్యవసాయ విజ్ఞాన, తదితర రంగాలకు, విభాగాలకు సంబంధించి కొన్ని వేల గ్రంథాలు, దిన, వార మాస పత్రికలు, జాతీయ, అంతర్జాతీయ విజ్ఞాన పత్రికలు ఉన్నాయి. వీటితో పాటు దృశ్యశ్రవణ ప్రసార మాధ్యమాలు ఉన్నాయి.

## దరఖాస్తు ఇలా...

దరఖాస్తు ఫారాల కోసం రూ.20లు స్వయంగా లేదా మనియార్డరు ద్వారా చెల్లించి శని, ఆదివారాల్లో మినహా అన్ని పనిదినాల్లో సంస్థ ద్వారా పొందవచ్చు. పూర్తి చేసిన ఫారాలకు తగిన ప్రమాణ పత్రాలను జతపరచి కోర్సు ప్రారంభ తేదీకి కనీసం 45 రోజులు ముందు సంస్థ చిరునామా(దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ మరియు పరీక్షణ సంస్థ, ట్రాక్టర్ నగర్, గార్లదిన్నె)కు పంపాల్సి ఉంటుంది. వ్యవసాయ యంత్రాల వినియోగంపై డిగ్రీ, డిప్లొమా విద్యార్థులకు నాలుగు వారాల ప్రాక్టికల్ శిక్షణ. ఐటీఐ, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు నాలుగు వారాల పాటు శిక్షణ ఉంటుంది.



వరినాట్లు వేయడంపై శిక్షణ పొందుతున్న దృశ్యం



ట్రాక్టర్ నగర్‌లోని వివిధ రకాల యంత్ర పరికరాలు

## సంస్థ ముఖ్య ఉద్దేశాలు

- వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి అవసరాలకు అనుగుణంగా వివిధ వ్యవసాయ యంత్రాలను ఎంపిక చేయడం
- వ్యవసాయ యంత్రాల మరమ్మతు, వినియోగించడంపై ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వడం
- భారత ప్రభుత్వ (బీఐఎస్) నిర్దేశిత నాణ్యత సూత్రాలకు అనుగుణంగా దేశంలో ఉత్పత్తి అవుతున్న వివిధ వ్యవసాయ యంత్రాలు, ఇంజన్లు, పంపులు, పవర్ టిల్లర్ల నాణ్యతను, మన్నికను పరీక్షించడం
- వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు లభ్యం అయ్యేలా చూడడం

## ఆధునిక యంత్రాలతో వేరుశనగ సాగు



ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు వేరుశనగ పంట సాగులో యంత్రాల ఉపయోగం వల్ల పెట్టుబడులు పొదుపు అవుతాయి. అన్ని రకాల పంటలకు సంబంధించిన ఆధునిక పరికరాలను ట్రాక్టర్ నగర్‌లో ప్రదర్శనకు ఉంచాం. ప్రస్తుతం వ్యవసాయా శాఖ ద్వారా ప్రతి యంత్రానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**– డాక్టర్ పీపీ రావు, డైరెక్టర్, దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ మరియు పరీక్షణ సంస్థ**